'ఈగ' సినిమాలో ప్రతినాయకుడిగా సుదీప్ నటనను రజనీకాంత్ ప్రత్యేకంగా ప్రశంసించారు. రాజమౌళి దర్శకత్వ ప్రతిభను అతనికే 'పాదాభివందనం' చేయాల్సిందేనంటూ ట్వీట్ చేసారు రాంగోపాల్‌వర్మ, చిరంజీవి, నాగార్జున, మహేష్‌బాబు, ఎన్టీఆర్ తదితరులు సైతం రాజమౌళికి కంగ్రాట్స్ చెప్పారు. 'ఈగ' సినిమాపై ప్రశంసల వర్షం కురిపించే విషయంలో టాలీవుడ్ ప్రముఖులతో కోలీవుడ్ మరియు బాలీవుడ్ ప్రముఖులు సైతం పోటీలు పడ్డారు.

కానీ... ఇవన్నీ ఒకెత్తైయితే... కార్పొరేట్ దిగ్గజం వి.రాజన్న 'ఈగ' చిత్రాన్ని విభిన్న కోణంలో విశ్లేషిస్తూ... ప్రఖ్యాత ఆంగ్ల దినపత్రిక 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కోసం రాసిన వ్యాసం 'ఈగ' సినిమాకు లభించిన ఓ ప్రశంసాపత్రంలాంటిదని చెప్పొచ్చు. ఇది కేవలం ప్రశంసాపత్రం మాత్రమే కాదు.. ఓ 'యోగ్యతా పత్రం' వంటిదని చెప్పడం సైతం అతిశయోక్తి కాదు.

రజనీకాంత్ మొదలుకుని మిగతా ప్రముఖులంతా ఈ చిత్రాన్ని... నటన, దర్శకత్వం, సంగీతం, కంప్యూటర్ గ్రాఫిక్స్ వంటి కోణాల్లో పరిశీలించి ప్రశంసిస్తే ... 'ఈగ' చిత్రాన్ని వి.రాజన్న చూసిన కోణం పూర్తిగా వేరు.

కార్పొరేట్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు గడించిన వి. రాజన్న... 'ఈగ' చిత్రంలో దాగున్న 'మేనేజ్‌మెంట్ పాఠాలను' వెలికి పట్టుకుని ప్రేక్షకులకు పరిచయం చేయడం ద్వారా తన ప్రత్యేకతను చెప్పకనే చెప్పుకున్నారు.

'మాయాబజార్' చిత్రంలోని 'ప్రియదర్శిని'ని కృష్ణుడు, తదితరులు వీక్షించినప్పుడు వారివారికి ఇష్టమైన వ్యక్తులు, వస్తువులు కనిపించినట్టుగా... 'ఈగ' సినిమాలో వి.రాజన్నకు మేనేజ్‌మెంట్ సూత్రాలు గోచరించడం విశేషం. 'టీసీయస్'గా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' వైస్ ప్రెసిడెంట్ మరియు రీజనల్ హెడ్ అయిన వి. రాజన్న .. 'ది ఐటి అండ్ ఐటిఇయస్ ఇండస్ట్రీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'కు ప్రెసిడెంట్‌గానూ తన ప్రత్యేక సేవలందిస్తున్నారు.

ఐటి రంగంలో అందించిన విశిష్ట సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక 'రాయిడస్య పురస్కారాన్ని' కూడా అందుకుని ఉండటం వి.రాజన్న ప్రత్యేకత. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో 'టిప్స్ ఫ్రమ్ ఫ్లై' శీర్షికన ప్రచురితమై... కార్పొరేట్ సర్కిల్స్‌లో విశేషంగా చర్చించుకోబడుతున్న తెలుగు వ్యాసం తెలుగు స్వేచ్ఛానువాదాన్ని 'సినీస్టార్' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం...!!

'నిన్ను నువ్వు తక్కువ చేసుకోవద్ద'న్నదే 'ఈగ' సందేశం!

వి.రాజన్న వైస్ ప్రెసిడెంట్ & రీజనల్ హెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)
ప్రెసిడెంట్: ది ఐటి & ఐటిఇయస్ ఇండస్ట్రీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

నైజెల్ రైబ్నర్ రాసిన 'ది ఇంపాక్ట్ కోడ్' పుస్తకాన్ని చదువుతున్నప్పుడు నేను ఎటువంటి భావావేశానికి లోనయ్యానో... అచ్చు అటువంటి భావోద్వేగానికే లోనయ్యాను... 'ఈగ' సినిమాను నా కుటుంబ సభ్యులతో కలిసి చూసినప్పుడు. సానుకూల దృక్పథంతో ముందుకు సాగే వ్యక్తుల జీవితాల్లో ఎటువంటి విప్లవాలు ఆవిష్కృతమవుతాయో వివరిస్తూ నైజెల్ రైబ్నర్ ఇలా అంటారు... "మన జీవితానికి సంబంధించి మనం చేసే కొన్ని మార్పులు.. మన చుట్టూ ఉన్న మనుషుల జీవితాలను సైతం తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. కానీ కొంతమంది ఎప్పుడూ నిరాశనిస్పృహలతో నీరసించి పోతూ ఉంటారు. తాము ఎవరి పైనా లేశమంత ప్రభావాన్ని సైతం చూపలేమని భావిస్తూ ఉంటారు. కానీ ఇది నిజం కాదు. కచ్చితంగా నిజం కానే కాదు!

ఇదే విషయాన్ని మరింత ప్రభావశీలంగా వివరిస్తూ ఓ ఆఫ్రికన్ సామెతను రైబ్నర్ ఉదహరిస్తారు. 'ఎవరిపైనా... ఎటువంటి ప్రభావాన్నీ చూపలేనంత అప్రధానమైన వ్యక్తిగా నిన్ను నువ్వు పరిగణించు కుంటున్నట్లయితే... ఒక దోమతో కలిసి నువ్వు ఒక్క రాత్రి కూడా గడపలేదన్నమాట" అంటారు రైబ్నర్.

పరిమాణంతో పనిలేకుండా పోరాట పటిమతో ఎవరైనా ఎలా ముందుకు పోగలరో స్ఫూర్తిదాయకంగా వివరించడమే చిత్రం 'ఈగ'.

విఖ్యాత అమెరికన్ సైకాలజిస్ట్ మరియు ఫిలాసఫర్ విలియం జేమ్స్ చెప్పిన మాటల్ని ఈ సందర్భంగా మనం మననం చేసుకోవడం అవసరం "నువ్వు చేసే ప్రతి పనికీ ఓ ప్రత్యేకత ఉంటుందన్నట్లుగా నువ్వు ప్రవర్తించు. ఆ ప్రత్యేకత దానికదే సంతరించుకుంటుంది".

బహుశా ఇటువంటి ప్రత్యేకమైన ఆలోచనా ధోరణి ప్రభావంతోనే దర్శకుడు రాజమౌళి 'ఈగ' చిత్రాన్ని రెగ్యులర్ కమర్షియల్ ఫార్ములాకు భిన్నంగా రూపొందించి ఉంటారు.

మన తెలుగు చలన చిత్ర సీమకు సంబంధించి నంతవరకు ఇదొక సినిమాద్భుతమని చెప్పక తప్పదు. ఈ మార్పు తెలుగు సినిమా ప్రమాణాలను మాత్రమే కాదు... తెలుగు ప్రేక్షకుల ఆలోచనా ప్రమాణాలను సైతం పెంపొందించడం ఖాయం!

'ఈగ' చిత్రంలో 'లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'కు ఉపకరించే అనేక అంశాలు, పాఠాలు నిబిడీకృతమై ఉన్నాయి.

అవేంటంటే...

□ మనసుంటే మార్గముంటుంది అనే ప్రాథమిక విజయ సూత్రాన్ని ఈ చిత్ర కథాంశం ఇముడ్చుకుని ఉండటాన్ని మనం గమనించవచ్చు. మనం ఏదైనా ఒకదాన్ని విశ్వసించి.. మన ఉచ్ఛ్వాసనిశ్వాసాలను సైతం దానిపైనే కేంద్రీకరిస్తే కచ్చితంగా విజయం వరించి తీరుతుంది. 'ఈగ' చిత్రంలో నాని అనే ఈగ తన సైజును అడ్వాంటేజ్‌గా తీసుకుని సుదీప్ అనే అత్యంత ప్రమాదకరమైన, శక్తివంతమైన వ్యక్తిని ఎదుర్కొన్న తీరు... అతన్ని ముప్పతిప్పలు పెట్టిన విధానం ప్రశంసనీయం!

□ ప్రేరణ ప్రభావం కొన్ని సందర్భాల్లో కొంతమంది ద్వారా పొందే ప్రేరణ కొందరి జీవితాలను ఏవిధంగా ప్రభావితం చేస్తుందనేది కూడా 'ఈగ' చిత్రంలో బిందు (సమంత) పాత్ర తాగుబోతు దొంగ (తాగుబోతు రమేష్) పాత్రల ద్వారా తేటతెల్లమవుతుంది.

ఈగతో బిందు ముచ్చటిస్తున్న మాటలు వింటూ.. అవి తన పట్ల మాట్లాడిన మాటలుగా భావించిన దొంగ పాత్ర తనను తాను సంస్కరించుకున్న విధానం గమనార్హం.

తన జీవితంలో ఎప్పుడూ ఎవరూ అంత ప్రేమగా, ప్రోత్సాహపూర్వకంగా మాట్లాడడం ఎరగని ఆ దొంగ.. బిందు మాటలతో అంతులేనంత స్ఫూర్తిని పొంది తన జీవితాన్ని తానే సరికొత్తగా నిర్మించుకుంటాడు. తను పనిచేసే కంపెనీలో స్టార్ పెర్ఫార్మర్ స్థాయిని సాధించి. విదేశంలో కంపెనీకి ప్రాతినిధ్యం వహించేంత ప్రతిష్టను సొంతం చేసుకుంటాడు. గుడిలో బిందు చేతులమీదుగా పాస్‌పోర్ట్‌ను తీసుకుంటున్నప్పుడు కెమెరామెన్‌గా మారిన ఆ దొంగ కళ్ళల్లో కనిపించే మెరుపు... బిందువల్ల అతనికి కలిగిన ప్రేరణకు ప్రతీకగా పేర్కొనవచ్చు.

□ తాను ఇష్టపడి అనుకున్న దాని కోసం మనమాటిస్తున్న పోరాటం చేయడం ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అనేక అన్యాయాలు మనకు ఆవేదన కలిగిస్తుంటాయి. మనలో నిరాశ నిస్పృహలను ప్రోది చేస్తుంటాయి. కానీ తనకు జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా 'ఈగ' చేసే వీరోచిత ప్రయత్నం 'పోరాటపటిమ' ఆవశ్యకతను మనకు తెలియచెబుతుంది. పట్టు సడల నీయక మనం చేసే పోరాటం ఎటువంటి సత్ఫలితాలని ఇస్తుందో వివరిస్తుంది.

□ ఎదుటివారి బాధని, బాధ్యతని అర్థం చేసుకోవడం యాంత్రికజీవనం (మెటీరియలిజం) మనుష్యుల్ని మనీమైండెడ్‌గా, స్వార్థపరులుగా చేసేస్తోంది. స్వార్థపూరిత ఆలోచనాధోరణి పరోపకారానికి ప్రాధాన్యమివ్వనీయడం లేదు. కానీ 'ఈగ' చిత్రంలో నాని అనే ఈగ బిందు పరిస్థితిని అర్థం చేసుకుంటుంది. ఆమె ముఖంపై మళ్ళీ చిరునవ్వు విరిసేలా చేస్తుంది. అంతేకాదు సుదీప్‌ను అంత మొందించేందుకు బిందుతో కలిసి వ్యూహరచన చేయడం, ఆ వ్యూహాలను అమలు పరచడంలో ఆమె సలహా సహకారాలు తీసుకోవడం కూడా మనం ఇందులో గమనించవచ్చు. 'చెడు'తో చెడుగుడు ఆడుకోవడం కోసం బిందు, నానిలు పరస్పరం సహకరించుకోవడం, తమ తమ శక్తియుక్తులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ఎంతైనా స్ఫూర్తిదాయకం. ఒక లీడర్‌కు - ఒక మేనేజర్‌కు ఉండే వ్యత్యాసం బయటపడేది ఇటువంటి సందర్భాల్లోనే!

ఈ చిత్రంలో స్పష్టంగా దాగున్న సందేశమేమిటంటే..

"నిన్ను నువ్వు ఎప్పుడూ తక్కువగా అంచనా వేసుకోవద్దు. సంకల్పబలంతో సాధికారికంగా నువ్వు వేసే ముందడుగు.. నీ జీవితాన్ని, నీ తోటివారి జీవితాన్ని, నీ కుటుంబ సభ్యుల జీవితాలను మాత్రమే కాకుండా, సమాజ స్థితిగతుల్ని సమూలంగా మార్చడమే కాకుండా... దేశాభ్యున్నతికి సైతం దోహదపడతాయి. నీలో నిద్రాణంగా దాగివున్న శక్తి సామర్థ్యాలను వెలికి తీసుకురావాల్సిన బాధ్యత పూర్తిగా నీదే!

ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబిస్తున్నాయా లేక... లేక గోరంతను కొండంత చేసి చూపుతున్నాయా అనే విషయాన్ని , వాదాన్ని పక్కన పెడితే- ప్రజలను అమితంగా ప్రభావితం చేసే శక్తి సినిమాలకుంది. అత్యంత శక్తి వంతమైన, ప్రభావశీలమైన ఈ మాధ్యమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

అటువంటి ఆలోచనాత్మకమైన 'ఈగ' వంటి చిత్రాన్ని రూపొందించిన దర్శక నిర్మాతలను అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి మంచి చిత్రాలు టాలీవుడ్ నుంచి మరెన్నో రావాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం!!!

ధీరజ అప్పాజీ